ప్రజామోదమా? ఖేదమా??

- శాసనసభలో నేడు బడ్జెట్ దాఖలు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వార్షిక బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటిస్తారని అన్ని వర్గాలు ఆశిస్తున్నాయి. శాసనసభలో ఆర్థిక మంత్రి చేసే బడ్జెట్ ప్రసంగాన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నగరంలో వంద ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేయడానికి సన్నాహాలు చేపడుతోంది. ఇదే విధంగా రాష్ట్రమంతటా 836 ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రసారం చేయనున్నారు. ఈ బడ్జెట్‌లోనూ మహిళలు మెచ్చేలా కొన్ని ప్రకటనలు జారీ చేస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం అర్హులైన గృహిణులకు మాత్రమే ఇస్తున్న రూ.1000 పథకాన్ని ఏప్రిల్ నుండి బియ్యంకార్డులున్న గృహిణు


శాసనసభలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ అప్పావు, మంత్రి ఏవీ వేలు

లందరికీ విస్తరింపజేసే అవకాశం ఉంది. ఇక మహిళల కోసం రాష్ట్రవ్యాప్తంగా బస్సుల సంఖ్య పెంచే ప్రకటన కూడా బడ్జెట్‌లో ఉంటుందని డీఎంకే సీనియర్ మంత్రులు చెబుతున్నారు. డీఎంకే ప్రభుత్వం విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో ఆ రెండు రంగాల్లో ఆకర్షణీయమని పథకాలను ప్రకటిస్తారని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌సమావేశాలు ఆరు రోజులపాటు జరిగే అవకాశాలున్నాయి. ఆ తర్వాత తదుపరి తేదీ ప్రకటించకుండా సమావేశాలు వాయిదా పడతాయి. కొద్ది రోజుల తర్వాత మళ్ళీ ఏప్రిల్‌లో బడ్జెట్ సమావేశాలు కొనసాగుతాయి.

ఆర్థిక సర్వే విడుదల...

ఈ యేడాది కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే విడుదల చేసే పద్ధతిని డీఎంకే ప్రభుత్వం పాటించింది. ఆ మేరకు సచివాలయంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం రూపొందించిన రాష్ట్ర ఆర్థిక సర్వే 2024-25ను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి , ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ జయరంజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఉదయచంద్రన్, ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి జేఏ రిషబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సర్వేలో రాష్ట్ర తలసరి ఆదాయవృద్ధి జాతీయ సగటు కంటే అధికంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 2022-23లో తలసరి ఆదాయం రూ.2.78లక్షలుంది. జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1.69 లక్షల కంటే ఇది 1.64 రెట్లు ఎక్కువ అని పేర్కొన్నారు.

చెస్ క్రీడాకారుడు ప్రణవ్ వెంకటేష్‌కు

రూ.20లక్షల ప్రోత్సాహకం


ప్రణవ్ వెంకటేష్‌కు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఫిడే వరల్డ్ జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచిన రాష్ట్రానికి చెందిన చెస్ క్రీడాకారుడు ప్రణవ్ వెంకటేష్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.20లక్షల ప్రోత్సాహకాన్ని చెక్కు రూపంలో అందజేశారు. పెట్రోవాక్‌లో నిర్వహించిన వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన ప్రణవ్ వెంకటేష్‌కు రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ప్రోత్సాహక నగదు అందజేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ఆ క్రీడా శాఖ నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చించిన మీదట రూ.20లక్షలను ప్రోత్సాహక నగదుగా అందజేయాలని నిర్ణయించారు. సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రణవ్ వెంకటేష్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్యమిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరి జే మేఘనాథరెడ్డి, ప్రణవ్ వెంకటేష్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన రుణభారం

- వైద్యుడి కుటుంబాన్ని బలిగొన్న అప్పులు
- అన్నానగర్‌లో దుర్ఘటన


డాక్టర్ బాలమురుగన్, ఆయన భార్య సుమతి (ఫైల్‌ఫొటో)


డాక్టర్ బాలమురుగన్ ఇంటి వద్ద గుమికూడిన స్థానికులు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధకు ఓ వైద్యుడి కుటుంబం బలైంది. అప్పు తీర్చలేక వైద్యుడు, అతని భార్యాబిడ్డలు బలవన్మరణానికి పాల్పడ్డారు. తిరుమంగళం పోలీసులు కేసు నమోదు చేసుకుని జరిపిన ప్రాథమిక విచారణలో ఆ నలుగురూ ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. అన్నానగర్‌లో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి...తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు ప్రాంతానికి చెందిన డాక్టర్ బాలమురుగన్ (53) నగరంలో 25 యేళ్లుగా నివశిస్తున్నారు. కొళత్తూరులో ఆయనకు సొంతిల్లుండగా, అన్నానగర్‌లో రెండు, రెడ్‌హిల్స్‌లో రెండు స్కానింగ్ సెంటర్లు నడుపుతున్నారు. వాటిని సమర్థవంతంగా నడిపేందుకుగాను ఆయన అన్నానగర్‌లోనే ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకుని కుటుంబంతో వుంటున్నారు. బాలమురుగన్ భార్య సుమతి హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఇటీవల పనిభారం ఎక్కువ కావటంతో కోర్టు లావాదేవీలకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నారు. ఈ దంపతుల పెద్దకుమారుడు జశ్వంత్‌కుమార్ (18) ప్లస్-2 పూర్తయి నీట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. చిన్న కుమారుడు లింగేష్‌కుమార్ (16) పదో తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం బాలమురుగన్ ఇంటికి పనిమనిషి రేవతి వెళ్లింది. ఎంతసేపు తలుపుతట్టినా ఎవరూ తలుపులు తెరవలేదు. డాక్టర్‌కు, ఆయన భార్యకు ఫోన్‌చేసినా తీయలేదు. దీంతో ఆ పనిమనిషి డాక్టర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న విజయ్, ఆ భవనసముదాయం వాచ్‌మెన్ జయరామన్‌తో కలిసి ఫ్లాట్ ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూశారు. ఫ్లాట్‌లోని నలుగురూ నాలుగు గదుల్లో ఉరితాళ్లకు వేలాడుతూ కనిపించారు. ఈ సమాచారం అందుకున్న తిరుమంగళం పోలీసులు హుటాహుటిన అక్కడకి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో స్కానింగ్ సెంటర్ల విస్తరణ చేపట్టేందుకు డాక్టర్ బాలమురుగన్ బ్యాంకుల నుండి రూ.5 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారని, ప్రతినెలా రూ.6లక్షల చొప్పున వాయిదాల పద్ధతిలో రుణం తీరుస్తున్నట్లు తెలిసింది. అయితే రెండు స్కాన్ సెంటర్లలోనూ ఆదాయం తగ్గి నష్టాల్లో కొట్టుమిట్టాడడంతో బ్యాంక్ రుణం తీర్చలేకపోయాడని తెలిసింది. ఈ విషయం గురించి భార్యకు తెలిపి అప్పులు తీర్చలేకపోతున్నానని చెబుతూ రోజూ బాధపడుతుండేవాడని సమాచారం. ఈ నేపథ్యంలో బాలమురుగన్, ఆయన భార్య, ఇద్దరు కుమారులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అప్పులిచ్చిన బ్యాంక్ అధికారులు ఎవరైనా ఇంటికొచ్చి బెదిరించి వెళ్లారా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అన్నానగర్ ప్రాంతంలో తీవ్ర కలకలం సృష్టించింది.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేత్రపర్వంగా రథోత్సవాలు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాసి మఖ ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో రథోత్సవాలు ఘనంగా జరిగాయి. కోయంబత్తూరు కారమడై రంగనాథస్వామివారి ఆలయ రథోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. సుమారు తొమ్మిది శతాబ్దాలనాటి ప్రాచీన వైష్ణవ క్షేత్రమైన ఈ ఆలయంలో ప్రతియేటా మాసిమఖం రథోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆ మేరకు ఈ యేడాది మాసిమఖం ఉత్సవాలు ఈ నెల 6న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలలో స్వామివారు శ్రీదేవి, భూదేవీ సమేతుడై వివిధ వాహనాల్లో ఊరేగారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం బుధవారం సాయంత్రం ప్రారంభమైంది. రథోత్సవాన్ని పురస్కరించుకుని పూజారులు మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గురువారం వేకువజాము 5.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి సర్వాలంకరణ శోభితుడై రథంపైనున్న ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఆ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఇష్టదేవేరులతో కారమడై రంగనాథస్వామి

సాయంత్రం 4.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. ఈ వేడుకల్లో కోయంబత్తూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ నుండి కూడా వేల సంఖ్యలో భక్తులు వవచ్చారు. ఆలయ చతు ర్మాడ వీధుల్లో ఊరేగిన తర్వాత రథ మండపానికి రథం చేరింది. ఈ వేడుకలను పురస్కరించుకుని కోయంబత్తూరు - మేట్టుపాళయంలో ట్రాఫిక్ మార్పులు కూడా చేపట్టారు. డీఎస్పీ కార్తికేయన్ నాయకత్వంలో సుమారు 300 మంది పోలీసులతో తగు భద్రతా ఏర్పాట్లు కూడా చేపట్టారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు - సంపూర్ణ అలంకారంతో పళని మారియమ్మన్(ఇన్‌సెట్లో)

పళని మారియమ్మన్ ఆలయంలో..

పళని మారియమ్మన్ ఆలయ రథోత్సవం కూడా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో మాసి ఉత్సవాలు ఈ నెల 4న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొలు త అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సర్వాభరణాలు, సంపూర్ణ పుష్పాలంకారంతో అమ్మవారు రథంపై ఆశీనులయ్యారు. భక్తులు ఇరువైపులా నిలిచి మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ 'ఓం శక్తి... ఆదిపరాశక్తి' అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని ప్రధాన వీధులలో ఊరేగించారు.

నెలవారీ బస్ పాస్

రూ.2000

- ఏసీ బస్సుల్లోనూ అనుమతి
- ఎంటీసీ నిర్ణయం



పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న ఏసీ సహా అన్ని బస్సుల్లో ప్రయాణించేలా రూ.2,000లతో కూడిన నెలవారీ బస్ పాస్ పరిచయం చేయాలని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్ణయించింది. నగరం, శివారు ప్రాంతాలకు ఎంటీసీ ప్రతిరోజూ సాధారణ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, ఏసీ బస్సులు నడుపుతోంది. సాధారణ బస్సుల్లో దూరాన్ని బట్టి మంత్లీ బస్ పాస్‌లు ఇస్తున్నారు. మంత్లీ రూ.1,000 పాస్ కలిగిన వారు ఏసీ బస్సులు మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఎన్ని సార్లయినా ప్రయాణించవచ్చు. ఈ నేపథ్యంలో, ఏసీ సహా అన్ని బస్సుల్లో ప్రయాణించేలా రూ.2,000 నెలవారీ బస్ పాస్ అందించాలని ఎంటీసీ నిర్ణయించింది. ఈ విధానం మే, జూన్‌లో పరిచయయమ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. అదే సమయంలో, రూ.2,000 బస్ పాస్ అమలుచేస్తే ప్రస్తుతం అందజేస్తున్న రూ.1,000 బస్ పాస్‌ను రద్దు చేయొద్దని ప్రయాణికులు ఎంటీసీకి విజ్ఞప్తి చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.26
సహర్ (శనివారం) : 4.37

మహిళలకు ఆర్థిక భరోసా

- స్వయం సహాయక బృందాలకు ఆటోలు


మినీ ఆటోలు ప్రారంభిస్తున్న ఉదయనిధి

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక బృందాల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేలా 50 మినీ ఆటోలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పంపిణీ చేశారు. గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న కురింజి హౌస్‌లో గురువారం ఉదయం వాతావరణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు 50 మినీ ఆటోలను అందజేసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేసిన దిండుగల్ జిల్లాకు చెందిన ఎస్.పంజంపట్టి ప్రభుత్వ మహోన్నత పాఠశాల, ఇడయార్‌కోట నెహ్రూ ప్రభుత్వ మహోన్నత పాఠశాల, కరూర్ జిల్లాకు చెందిన పుగలూరు ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల, తిరుచ్చిలోని కంజనాయకన్‌పట్టి ప్రభుత్వ మహోన్నత పాఠశాలలను అభినందిస్తూ ప్రధానోపాధ్యాయులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. అలాగే, పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న కోస్తా తీరప్రాంత జిల్లాల మ్యాప్‌లు, మత్స్యకారుల జీవన విధానం, సముద్ర సంపద తదితరాలపై ముద్రించిన మూడు పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించగా, తొలిప్రతిని మంత్రి తంగం తెన్నరసు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ... త్రిభాషా విద్యా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని, ద్రవిడ పితామహుడు పెరియార్‌ను కించపరిచేలా వ్యవహరించడం, పార్లమెంటులో బాధ్యత గల కేంద్ర మంత్రులు తమిళులను అనాగరికులు అని విమర్శించడం ఖండించదగ్గదని డిప్యూటీ సీఎం తెలిపారు.

పరందూరు ఎయిర్‌పోర్టుకు విధానపరమైన అనుమతులు!?

అడయార్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో పెరుగుతున్న విమాన ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని కాంచీపురం జిల్లా పరందూరులో మరో విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం తలపెట్టిన విషయం తెలిసిందే. దీనికి కేంద్రం పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విధానపరమైన అనుమతి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విమానాశ్రయానికి అవసరమైన స్థల సేకరణలో రాష్ట్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులు నిమగ్నమైవున్నారు. అదేసమయంలో ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు విధానపరమైన అనుమతులను మంజూరు చేయాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వినతి పత్రం సమర్పించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆధారాలతో పాటు వివిధ రకాల పత్రాలను రాష్ట్రం అందజేసింది. ఈ నేపథ్యంలో ఈ వినతి పత్రాలను పరిశీలించే కీలక సమావేశం బుధవారం ఢిల్లీలో జరిగింది. ఇందులో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ కమిషన్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారుల, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇందులో పరందూరు విమానాశ్రయానికి సంబంధించిన అనేక సందేహాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నివృత్తి చేసేందుకు ప్రయత్నించారు. అలాగే, ఈ విమానాశ్రం ఏర్పాటుపై నెలకొన్న అనేక సందేహాలు, ప్రశ్నలు, గ్రామాల ప్రజల ఆందోళన తదితర అంశాలపై కేంద్ర అధికారులు లేవనెత్తిన ప్రశ్నలకు రాష్ట్ర అధికారులు ఓపిగ్గా బదులిచ్చారు. దీంతో పరందూరు కొత్త విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం విధానపరమైన అనుమతులు మంజూరు చేయొచ్చని రాష్ట్ర అధికారులు భావిస్తున్నారు.

సమాచార దర్శిని

'తోళి' హాస్టల్స్ ముందస్తు బుకింగ్

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉమెన్స్ హాస్టల్ కార్పొరేషన్ వర్కింగ్ ఉమెన్స్ కోసం 'తోళి హాస్టల్స్' అడయార్‌లో ఆధునిక వసతులతో నిర్మించారు. ఇందులో 24 గంటల భద్రత, బయోమెట్రిక్‌లో రాక, పోకల నమోదు, ఉచిత ఇంటర్నెట్ సదుపాయం, పలు వినోద కార్యక్రమాలతో కూడిన ఈ హాస్టల్‌లో బసచేసేందుకు రూ.4,500-రూ.6,850 రుసుముగా నిర్ణయించారు. ఈ హాస్టల్స్‌లో రోజు, నెలవారీ పద్ధతిలో గదులు పొందేందుకు www.tn wwhcl.in అనే వెబ్‌సైట్, 9499988009, 944572 4179 అనే నెంబర్లు సంప్రదించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలియజేసింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా జనరల్ క్లాస్ బోగీలు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎగ్మూర్ నుంచి నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా ఒక జనరల్ బోగీ అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఆ ప్రకారం, నెం. 12636/12635 మదురై-చెన్నై ఎగ్మూర్-మదురై మధ్య నడిచే వైగై ఎక్స్‌ప్రెస్, నెం.12605/12606 చెన్నై ఎగ్మూర్-కారైక్కుడి-చెన్నై ఎగ్మూర్ మధ్య నడిచే పల్లవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా ఒక జనరల్ బోగీ అనుసంధానం చేయనున్నారు.

నేడు డీఎంకే ఎమ్మెల్యేల సమావేశం

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో శుక్రవారం డీఎంకే ఎమ్మెల్యేలు సమావేశం కానున్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ సమావేశాల్లో మాట్లాడాల్సిన అంశాల గురించి ముఖ్యమంత్రి సూచన చేస్తారని తెలిసింది. తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని ప్రకటించారు.

మారియమ్మన్ హుండీ ఆదాయం రూ. కోటి

పెరంబూర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయ హుండీ ఆదాయం రూ.కోటి వచ్చినట్టు అధికారులు తెలిపారు.ఈ ఆలయానికి దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు,ఆలయ హుండీల్లో కానుకలు సమర్పిస్తుంటారు. ఈనేపథ్యంలో నెలకు రెండు సార్లు హుండీల ఆదాయాన్ని లెక్కిస్తారు. ఆలయ ప్రాంగణంలోని హాలులో మంగళవారం హుండీల లెక్కింపు ప్రారంభమైబుధవారం ముగిసింది.అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, రూ.1,06,20,548 నగదు, 2.150 కిలోల బంగారం, 3.580 కిలోల వెండి, 103 విదేశీ నోట్లు, 489 విదేశీ నాణేలు కానుకలుగా సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు.

నెసపాక్కం శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలం 137వ వార్డులోని నెసపాక్కం శ్మశానవాటికను మరమ్మతుల కారణంగా ఈ నెల 12 నుంచి సెప్టెంబరు 11వ తేది వరకు మూసివేశారు. ఆ సమయంలో ప్రజలు సమీపంలోని ఏవీఎం, అన్నై సత్యా నగర్ శ్మశానవాటికలు వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది.

వంద ప్రాంతాల్లో బడ్జెట్ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో ఈ నెల 14న ఆర్థిక బడ్జెట్, 15 వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌లోని అంశాలు ప్రజలు తెలుసుకొనేలా నగరంలోని వంద ప్రాంతాల్లో బడ్జెట్ సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్, మురసోలి మారన్ పార్క్, అన్నానగర్ టవర్ పార్క్, కోయంబేడు బస్ టెర్మినల్, మెరీనా బీచ్, పాండి బజార్ రోడ్డు, కత్తిపార పార్క్, బీసెంట్ నగర్ బీచ్, తిరువాన్మియూర్ బీచ్, టైడల్ పార్క్ జంక్షన్ సహా వంద ప్రాంతాల్లో బడ్జెట్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రకటన విడుదల చేసింది.

నేడు షోళింగనల్లూరులో జనసేన ఆవిర్భావ వేడుకలు

అడయార్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం షోళింగనల్లూరులో జరుగున్నాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం, సినీ నటుడు సప్తగిరితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్టు జనసేన పార్టీ చెన్నై విభాగం కన్వీనర్ తమ్మయ్య నాయుడు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆవిర్భావ వేడుకల్లో చెన్నై మహానగరంలోని జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళలతో పాటు పార్టీ అధినేత, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు నాలుగు మండలాల్లో గణితం, సైన్స్ ఉపాధ్యాయుల మహానాడు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సైన్స్ పాఠ్యాంశాల అభ్యాసన మెరుగుపరిచేలా 'వానవిల్ (రెయిన్ బో) ఫోరం ఏర్పాటుచేయనున్నారు. అందుకు వినూత్న అభ్యాసం, బోధనపై పరిశోధనా పత్రాలు సమర్పించాలని గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు సూచించగా, 643 మంది వ్యాసాలు సమర్పించారు. వారి పరిశోధన నివేదికలు బహిరంగ వేదికపై వినిపించేలా ప్రాంతీయ ఉపాధ్యాయుల పరిశోధన సదస్సు నిర్వహించనున్నారు. ఆ ప్రకారం, ఈ నెల 15న పశ్చిమ మండలం పరిధిలోని కోవై, నీలగిరి, తిరుప్పూర్, ఈరోడ్, నామక్కల్, ధర్మపురి, కృష్ణగిరి, సేలం జిల్లాల్లోని ఉపాధ్యాయులకు నామక్కల్‌లో పరిశోధన మహానాడు జరుగనుంది. అలాగే, దక్షిణ మండలం పరిధిలోని మదురై, సెంట్రల్ జోన్ పరిధిలోని పుదుకోట, నార్త్ జోన్ మండలంలో వేలూరు తదితర ప్రాంతాల్లో శనివారం ఈ మహానాడు జరుగనున్నాయి.ఒక్కో మండలం నుంచి 10 ఉత్తమ పరిశోధన వ్యాసాలతో ఈ నెల 22న నగరంలో పరిశోధన మహానాడు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

1 నుంచి 9 తరగతుల వార్షిక పరీక్షల నోటిఫికేషన్

వేళచ్చేరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 1 నుంచి 9వ తరగతులకు వార్షిక పరీక్షల నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ ప్రకారం, 1 నుంచి 3వ తరగతి వరకు వార్షిక పరీక్షలు ఏప్రిల్ 15 నుంచి 21వ తేది వరకు జరుగనున్నాయి. అలాగే, 4,5 తరగతులకు ఏప్రిల్ 9 నుంచి 21వ తేది వరకు, 6 నుంచి 9వ తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 9న ప్రారంభమై 24వ తేది వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు.



సచివాలయంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఆరోవిడత సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఊటీ, కొడైకెనాల్‌లో పర్యాటక వాహనాలకు నిబంధనలు

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఊటీ, కొడైకెనాల్ వెళ్లే పర్యాటక వాహనాలకు మద్రాసు హైకోర్టు నిబంధనలు విధించింది. ఊటీ, కొడైకెనాల్ తదితర పర్యాటక ప్రాంతాలకు ఎన్ని పర్యాటకుల వాహనాలు అనుమతించాలి అనే కేసు మద్రాసు హైకోర్టు విచారిస్తోంది. ఈ కేసు విచారించి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో... ఊటీకి సెలవు లేని సాధారణ రోజుల్లో 6,000 పర్యాటక వాహనాలు, వారాంతపు సెలవు రోజుల్లో 8,000 వాహనాలు మాత్రమే అనుమతించాలి. అలాగే, కొడైకెనాల్‌కు సాధారణ రోజుల్లో 4,000 పర్యాటక వాహనాలు, వారాంతపు సెలవు రోజుల్లో 6,000 వాహనాలు అనుమతించాలి. ప్రభుత్వ బస్సులు, రైళ్లలో వచ్చే పర్యాటకులకు ఎలాంటి నిబంధనలు లేవు. స్థానిక వాహనాలు, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లే వాహనాలకు ఎలాంటి నిబంధనలు లేవు. కొండ కింద నుంచి నగరానికి వెళ్లేందుకు ఎలక్ట్రికల్ బస్సులు నడిపే అంశంపై పరిశీలించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే, ఈ నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమలు చేసి ఏప్రిల్ 25వ తేది నివేదిక దాఖలుచేయాలని, ఈ ఉత్తర్వులు జూన్ నెల అమలులో ఉంటాయని తెలిపిన మద్రాసు హైకోర్టు, తదుపరి విచారణ ఏప్రిల్ 25వ తేదీకి వాయిదా వేసింది.

వివాహ వేడుకలోనూ త్రిభాషా విధానంపై నిరసన



'తమిళ్ వాళ్గ' అక్షరాలతో వధూవరులు, స్నేహితులు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విధానానికి వ్యతిరేకంగా నూతన వధూవరులు 'తమిళ్ వాళ్గ' అంటూ అక్షరాలతో అవగాహన కల్పించడం పలువురిని ఆకట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేయ తలపెట్టిన త్రిభాషా విధానానికి రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధానానికి మద్దతుగా బీజేపీ సంతకాల సేకరణ చేపట్టింది. ఈ నేపథ్యంలో పూందమల్లి సమీపం నజరేట్‌పేటలో తమిళ్ సెల్వన్-శివరంజిని వివాహ రిసెప్షన్ బుధవారం రాత్రి జరిగింది. వధూవరులకు బంధువులు, స్నేహితులు 'తిరుక్కురల్' సహా పలు తమిళ పుస్తకాలు బహుమతిగా అందించారు. అనంతరం వధూవరులు తమ స్నేహితులతో కలసి 'తమిళ్ వాళ్గ' అనే అక్షరాలతో కూడిన ప్ల కార్డులు పట్టుకుని త్రిభాషా విధానానికి వ్యతిరేకత తెలిపారు. ఈ వినూత్న నిరసన అందరిని ఆలోచింపజేసింది.

డీఎంకేలో ఉండటం గర్వకారణం

● నటుడు సత్యరాజ్ కుమార్తె

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డీఎంకేలో కార్యకర్తగా ఉండడం గర్వంగా భావిస్తున్నట్లు ప్రముఖ సినీనటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర రవాణా సంస్థలు నడుపుతున్న బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, స్వయం సహాయక మహిళా బృందాలు 25 కిలోల వరకు ఉచితంగా లగేజీ తీసుకెళ్లడం, మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెడుతున్న పథకాలు తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. మహిళలకు తగిన గౌరవం ఇస్తున్న ఏకైక పార్టీ డీఎంకే మాత్రమేనని, ఓ మహిళగా తాను ఆ పార్టీలో ఉండడం గర్వంగా ఉందని దివ్య తెలిపారు.

దీక్షితార్లపై కేసులు రద్దు చేయలేం

● మద్రాసు హైకోర్టు

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరం నటరాజస్వామి ఆలయంలో కనకసభ వేదిక పైకెక్కి భక్తులు దర్శనం చేయడాన్ని అడ్డుకున్న దీక్షితార్లకు వ్యతిరేకంగా దాఖలైన కేసులు రద్దు చేసేందుకు మద్రాసు హైకోర్టు నిరాకరించింది. ఈ ఆలయంలో 2023 జూన్‌లో ఆరుద్ర దర్శన వేడుకల సందర్భంగా భక్తులు కనకసభ వేదిక పైకెక్కి స్వామి దర్శనం చేసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ ఉత్తర్వులు ఉల్లఘించిన దీక్షితార్లు కనకసభపై భక్తులు ఎక్కేందుకు నిరాకరించినట్లు ఫిర్యాదులున్నాయి.ఈనేపథ్యంలో, ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించిన దీక్షితాదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ చిదంబరం తిల్లయమ్మన్ ఆలయ నిర్వాహణాధికారి శరణ్య చిదంబరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆలయ అధికారుల విధులను అడ్డుకోవడం,బెదిరించడంపై దీక్షితార్లపై ఆరు కేసులు నమోదుచేశారు. ఈ కేసులు రద్దు చేయాలని కోరుతూ దీక్షితాదార్ల తరపున దాఖలైన పిటిషన్‌ను గురువారం న్యాయమూర్తి ఇళంద్రియన్ విచారించారు. ఇరుతరపు వాదనల అనంతరం, దీక్షితార్లపై నమోదైన కేసుల రద్దుకు నిరాకరిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

23వేల ఇళ్లకు 'రూఫ్ టాప్' సోలార్ ప్లాంట్స్

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకంలో, రాష్ట్రంలో 23వేల గృహాల్లో 120 మె.వా సామర్థ్యంతో 'రూఫ్ టాప్' సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటయ్యాయి. ప్రధానమంత్రి సోలార్ హోమ్ ఉచిత విద్యుత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించి, దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ బిల్లుల ఖర్చు తగ్గించేలా ప్రణాళిక రూపొందించారు. అందుకోసం 1 కే.వి. సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్‌కు రూ.30వేలు, 2 కె.వి. ప్లాంట్‌కు రూ.60 వేలు, అంతకు పైగా రూ.78వేలు సబ్సిడీగా ఇస్తోంది. ఈ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 30వేల మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 23వేల ఇళ్లకు మొత్తం 120 కె.వి. సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు.

4, 5, 7, 8 తరగతులకు కొత్తపాఠ్య పుస్తకాలు

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం ప్రకారం 2025-26వ విద్యాసంవత్సరం నుండి 4,5,7,8 తరగతులకు కొత్తపాఠ్య పుస్తకాలను పరిచయం చేయనున్నట్లు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) ప్రకటించింది. దేశంలో పాఠశాల విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాల రూపకల్పన, పాఠ్యపుస్తకాల పంపిణీ ఈ సంస్థ నిర్వహిస్తోంది. సీబీఎస్సీ, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు కూడా ఎన్సీఈఆర్టీ విధానాన్నేఅనుసరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ విద్యావిధానాన్ని ప్రధానంగా ఎంచుకుని అన్ని తరగతులకు కొత్తపాఠ్యాంశాలను పరిచయం చేసేందుకు నిర్ణయించిన ఈ సంస్థ ఇప్పటికే గత విద్యాసంవత్సరంలో 1,2,3,6 తరగతులకు కొత్తపాఠ్యాంశం అమలుపరచింది. వచ్చే విద్యాసంవత్సరంలో 4,5,7,8 తరగతులకు కూడా ఈ విద్యావిధానాన్ని అమలు పరనున్నట్లు సీబీఎస్సీ, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలకు ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ చెక్లానీ ఉత్తర్వులు జారీచేశారు.

'డ్రీమ్ హోమ్' లబ్ధిదారులు మొక్కలను సంరక్షించాలి

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'కలైంజర్ కనవు ఇల్లం (కలైంజర్ డ్రీమ్ హోమ్)' పథకంలో ఇళ్లు నిర్మించుకొనే లబ్ధిదారులు మొక్క నాటి సంరక్షించడం, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి తప్పనిసరి చేశారు. గ్రామీణ ప్రజలు కాంక్రీట్ గృహాలు నిర్మించుకుని తమ కలలు సాకారం చేసుకొనేలా, రూ.3.50 లక్షల సబ్సిడీతో 'కలైంజర్ కనవు ఇల్లం' ప్రాజెక్ట్ ప్రారంభించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... కనవు ఇల్లం పథకంలో ఇళ్లు నిర్మించుకొనే లబ్ధిదారులు తమ ఇంటి ముందు కనీసం 2 మొక్కలు నాటాలని, ఇంటి నిర్మాణం పూర్తయ్యే సరికి మొక్కన ఆరడుగులు పెరిగేలా సంరక్షించాలని, అప్పుడు చివరి దశ సబ్సిడీ విడుదల చేయనున్నామన్నారు. ఈ నిబంధన వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలుకు రానుందని అధికారులు తెలిపారు.

శ్రీ రామచంద్రాలో లాక్టేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్



లాక్టేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్ ప్రారంభించి పరిశీలిస్తున్న ఆర్.వి.వెంకటాచలం తదితరులు

అడయార్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర మెడికల్ సెంటర్‌లో లాక్టేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ చాన్సలర్ ఆర్.వి.వెంకటాచలం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవజాత శిశువుల, ముఖ్యంగా అకాల, తీవ్ర అనారోగ్యంతో ఉన్న శిశువుల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడానికి ఇది గొప్ప ముందడుగన్నారు. శిశువుల ప్రారంభ దశలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ పాల బ్యాంకుతో తల్లుల నుంచి మదర్ ఫీడింగ్ పొందలేని శిశువులకు సురక్షితమైన, పరీక్షించిన పాశ్చరైజ్ చేసిన దాత పాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర హాస్పిటల్‌కు చెందిన ప్రధాన విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం ఉంటేనే కారు కొనుగోలుకు అవకాశం

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొత్త నిబంధనలు అమలులోకి వస్తే, ఒక వ్యక్తి ఎన్ని కార్లు కొనుగోలు చేసినా, వాటిని పార్కింగ్ చేసే సదుపాయం ఉందనే పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. రాజధాని నగరం చెన్నైలో రోజురోజుకు కార్ల సంఖ్య పెరుగుతోంది. వాటిలో అధిక శాతం మంది కారు యజమానులకు పార్కింగ్ వసతి లేదు. అందువల్ల ఇంటి ముందున్న రోడ్లు, వీధుల్లో పార్కింగ్ చేస్తుండడంతో, ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ సమస్య అధిగమించేలా, నగరంలో కొత్తగా కారు కొనుగోలు చేసేవారు, కారు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో, కారు పార్కింగ్ కోసం స్థలం ఉన్నట్లు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి చెన్నై ఇంటిగ్రేటెడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సిఫారసు చేసింది. ఆ ప్రకారం, ఒక వ్యక్తి ఎన్ని కార్లు కొనుగోలు చేసినా, వాటిని పార్కింగ్ చేసేందుకు అవసరమైన దస్తావేజులు సమర్పించాలి. ఈ నిబంధన త్వరలో అమలుకు రానుందని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి



వినాయగం (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపట్టిన లైన్‌మేన్ విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పళ్లిపట్టు సమీపంలో టీవీ కండిగై గ్రామానికి చెందిన వినాయగం (44) కొలత్తూర్ విద్యుత్ బోర్డు కార్యాలయంలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. పళ్లిపట్టులోని ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయ సమీపంలో గురువారం ఉదయం విద్యుత్ మార్గంలో వినాయగం మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. విద్యుత్ స్తంభం పైకి ఎక్కి వినాయగం పనిచేస్తున్న సమయంలో హఠాత్తుగా విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనే మృతిచెందాడు. కొద్దిసేపటి అనంతరం అతని మృతదేహం స్తంభంపై నుంచి కిందపడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు వినాయగంకు వివాహమై ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో ఛార్జింగ్ కేంద్రాలు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విద్యుత్ వాహనాలకు ఛార్జింగ్ చేసేందుకు వీలుగా కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. జీసీసీ పరిధిలోని 15 మండలాల్లోని 89 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సదుపాయం ఉంది. విద్యుత్ వాహనాల సౌకర్యార్థం 89 వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని భావించిన జీసీసీ, తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ సహకారంతో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను గుర్తించే పనులు చేపట్టినట్లు, త్వరలో ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.



పోరూరు - రామాపురం వద్ద తన తండ్రి దివంగత డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పేరుతో హరిత ఉద్యానవనాన్ని ప్రారంభించినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పరిశోధనా సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్యా స్వామినాథన్

బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే రూ.లక్ష జరిమానా

● మదురై కార్పొరేషన్

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని మదురై కార్పొరేషన్ ప్రకటించింది. మదురై కార్పొరేషన్ పరిధిలోని మాట్టుదావని బస్టాండ్, ఉలగనేరి, హైకోర్టు మదురై బెంచ్, ఊత్తంగుడి, పాండి ఆలయం తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, కాలువల పక్కన చెత్త వేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని కార్పొరేషన్ ప్రకటించింది. అదే సమయంలో, ఈ ప్రకటన విడుదలైన 24 గంటల్లో చెత్త తొలగించని వారికి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు చేపడతామని కార్పొరేషన్ హెచ్చరించింది.

అటవీశాఖ నివేదికలో లోపాలు

మద్రాసు హైకోర్టు

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో ఏనుగులను వేటాడి తగులబెట్టిన ఘటనలో అటవీ శాఖ నివేదికలో లోపాలున్నాయని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపంలో ఈ నెల 1న ఏనుగు చంపి తగులబెట్టిన కేసు విచారణ మద్రాసు హైకోర్టులో జరుగుతోంది. గురువారం ఈ కేసు విచారణకు రాగా అటవీ శాఖ నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో లోపాలున్నాయని పేర్కొన్న హైకోర్టు, పూర్తి విచారణ వివరాలతో నివేదిక దాఖలుచేయాలని అటవీ శాఖను ఆదేశిస్తూ, తదుపరి విచారణ వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

భార్య హత్యకేసులో భర్తకు జీవిత ఖైదు

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి ప్రాంతంలో భార్యను హతమార్చిన కేసులో భర్తకు తిరువళ్లూర్ మహిళా కోర్టు బుధవారం యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. ఆవడి సమీపంలో ఉన్న మేళపాక్కం భజన ఆలయ వీధికి చెందిన సరిత (35), రెండో భర్త మదన్ (42)తో కలసి ఓ అద్దె ఇంట్లో నివసించేది. 2021 జనవరి 21వ తేది కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తల మధ్య జరిగిన వాగ్వివాదం హత్యకు దారితీసింది. దీనిపై అందిన సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న ఆవడి పోలీసులు మదన్‌ను అరెస్ట్ చేశారు. కొన్ని నెలల అనంతరం అతను బెయిలుపై విడుదలయ్యాడు. తిరువళ్లూర్ మహిళా కోర్టులో జరిగిన ఈ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో న్యాయమూర్తి రేవతి తీర్పు వెలువరించారు. అందులో... సరితను హతమార్చిన నేరానికి మదన్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. మృతురాలి కుమార్తెకు రూ. లక్ష పరిహారం అందించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

పోక్సో కేసులో...

స్థానిక ఎన్నూర్‌లో బాలికను బెదిరించి గర్భవతిని చేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడికి తిరువళ్లూర్ పోక్సో న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది.

క్రికెట్ బంతికోసం వెళ్లి.. విద్యుదాఘాతానికి గురై....

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బంతి తీసుకొచ్చేందుకు వెళ్లిన 13 ఏళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన విషాదం నింపింది. దిండుగల్ జిల్లా మనకాట్టూరులో పుహళేంది (13) బుధవారం సాయంత్రం స్నేహితులతో కలసి క్రికెట్ ఆడుతున్నాడు. ఆటలో బాట్స్‌మెన్ కొట్టిన బంతి మైదానం అవతల తోటలో పడింది. బంతి తీసుకొచ్చేందుకు వెళ్లిన పుహళేంది, తోటలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'ట్రిమ్మర్ మెషీన్' పార్శిల్‌లో కంకరరాళ్లు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో 'ట్రిమ్మర్ మెషీన్' ఆర్డరు చేసిన వినియోగదారుడు అందుకున్న పార్శిల్‌లో కంకరరాళ్లుండడంతో ఖంగుతిన్నాడు. నీలగిరి జిల్లా కున్నూర్ మేల్ కడై వీధికి చెందిన ఖాజా, కొద్ది రోజుల క్రితం ఆన్‌లైన్‌లో ట్రిమ్మర్ మెషీన్‌కు ఆర్డరు చేశారు. బుధవారం వచ్చిన పార్శిల్ చూసిన ఖాజా నిర్ఘాంతపోయాడు. అందులో మెషీన్‌కు బదులు కంకర రాళ్లు ఉన్నాయి. ఈ విషయమై డెలివరీ బాయ్‌ను ఖాజా ప్రశ్నించగా, ఆన్‌లైన్ సంస్థలకు నేరుగా ఆర్డరు చేయకుండా, ఫేస్‌బుక్ సహా పలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లు క్లిక్ చేసి ఆర్డరు చేస్తే ఇలాంటివి జరిగే అవకాశముందని, ఆన్‌లైన్ సంస్థల వెబ్‌సైట్‌లోనే ఆర్డరు చేయాలని సూచించాడు.

మాజీ మంత్రి వేలుమణి ఇంటి వివాహం

● నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వేలుమణి ఇంటి వివాహ రిసెప్షన్ వేడుకల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, అలంకార తోరణాలు ఏర్పాటు చేశారంటూ నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేశారు. అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి కుమారుడి వివాహం కోవైలోని కొడీసియా మైదానంలో ఈ నెల 10వ తేది జరిగింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, సినీ ప్రముఖులు, పార్టీ నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన పళనిస్వామికి ఆహ్వానం పలుకుతూ అవినాశి రోడ్డు నుంచి కొడీసియా మైదానం వరకు రోడ్డు మధ్యలో, ఇరువైపులా సుమారు 2 కి.మీ మేర విద్యుద్దీపాలు, పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, అనుమతి లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీ ఏర్పాటుచేసినందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రాణహాని కలిగించేలా విద్యుద్దీపాల అలంకరణ, ప్రజలకు ఇబ్బంది కలిగించడం, ట్రాఫిక్‌కు అంతరాయం సహా నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేశారు.

ఫీజు కట్టారని తెలియక విద్యార్థి ఆత్మహత్య



ఇళమారన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సెమిస్టర్ ఫీజు చెల్లించారని గ్రహించని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మదురై కామరాజర్ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ కంప్యూటర్ చదువుతున్న ఇళమారన్, సెమిస్టర్ ఫీజుగా రూ.15,000 చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలుపడంతో వారు డబ్బులు సర్దుబాటు కాలేదన్నట్లు సమాచారం. ఈ క్రమంలో, తన అవ్వ ఇంట్లో ఉంటున్న ఇళమారన్, ఇక ఫీజు కట్టకపోతే పరీక్ష రాయలేనని మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, మంగళవారం ఉదయం ఇళమారన్ తల్లి కళాశాలలో సెమిస్టర్ ఫీజు చెల్లించిందని, ఈ విషయమై తెలియని ఇళమారన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అవ్వ కన్నీటి పర్యంతం అయింది.

నీటమునిగి ప్లస్ వన్ విద్యార్థిని మృతి

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని బీచ్‌లో జరిగిన మాసిమఖ తీర్థవారిలో పాల్గొన్న ప్లస్ వన్ విద్యార్థిని అలల తాకిడి కొట్టుకు పోయి మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. పెరియకుప్పం గ్రామ సమీపంలో బీచ్‌లో బుధవారం మాసి మఖ తీర్థవారి జరిగింది. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కురింజిపాడి సమీపం అంబలవానన్‌పేట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ కుమార్తె, ప్లస్ వన్ చదువుతున్న ప్రిన్సి (16) కూడా పాల్గొంది. బంధువులతో బీచ్‌లో స్నానం చేస్తుండగా, ఆకస్మాత్తుగా వచ్చిన భారీ అలకు బాలిక కొట్టుకెళ్లింది. అనంతరం కొద్దిసేపటికి ఆమె మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ గేమ్ వద్దని మందలింపు

● 17 ఏళ్ల బాలుడు ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో 17 ఏళ్ల బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మదురైలో చోటుచేసుకుంది. మదురై కామరాజపురానికి చెందిన మణికంఠన్ 17 ఏళ్ల కుమారుడు ప్లస్ వన్ పూర్తయి, పాఠశాలకు వెళ్లకుండా ఏడాదిగా ఇంట్లోనే ఉంటున్నాడు. అతను తన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండేవాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించినా వారి మాటలు పట్టించుకోకుండా, అధిక సమయం గేమ్స్ ఆడుతుండేవాడు. ఈ క్రమంలో, కొద్దిరోజులుగా అతను తీవ్ర మనస్తాపంతో ఉంటూ ఎవరితో మాట్లాడడం లేదని తెలిసింది. మంగళవారం రాత్రి పక్కింటి బాలుడు వచ్చిన సమయంలో 'తన తండ్రి, తల్లిని చూసుకోవాలని' చెబుతూ, తన చేతిలోని సెల్‌ఫోన్ కిందకు విసిరేసి, మేడపై నుంచి దూకడంతో తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మెడికల్ క్రైమ్ థ్రిల్లర్‌గా వివేక్ ప్రసన్న 'ట్రామా'


'ట్రామా' ఆడియో రిలీజ్ దృశ్యం

వివేక్ ప్రసన్న హీరోగా 'ట్రామా' అనే మెడికల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కించారు. ఆల్బా 3 ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో డర్న్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్.ఉమామహేశ్వరి నిర్మించగా, డెబ్యూ డైరెక్టర్ తంబిదురై మారియప్పన్ దర్శకత్వం వహించారు. హీరోయిన్‌గా పూర్ణిమ రవి, ఇతర పాత్రల్లో అనంత్ నాగ్, చాందిని తమిళరసన్, నిళల్‌గల్ రవి, మారిముత్తు, ప్రదోష్, వయ్యాపురి, రమ, నమో నారాయణన్, ప్రదీప్ కే విజయన్, స్మైల్ సెల్వ, మదనగోపాల్ తదితరులు నటించారు. నగరంలో జరిగిన ఆడియో రిలీజ్ వేడుకలో సినీ ప్రముఖులు కె.భాగ్యరాజ్, రాధారవి, మాజీ ఎమ్మెల్యే విజయధరణి తదితరులు హాజరై ఆడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చిన నిర్మాత ఇలమారన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. పెద్ద ఆర్టిస్టులు ఎవరూ లేకుండా, కథపై ఉన్న నమ్మకంతో చిన్న ఆర్టిస్టులతో చిత్ర నిర్మాణం పూర్తి చేయడం గొప్ప విషయం. ఈ సినిమా విజయంతో డెబ్యూ డైరెక్టర్ తంబిదురైకు మరిన్ని సినీ అవకాశాలు రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఏ దేశంలోనైనా ప్రజాదరణ పొందిన ఏకైక కథ లవ్‌స్టోరీ. తొలిసారి దర్శకత్వం వహించే వారు ప్రేమకథల వైపు మొగ్గు చూపుతారు. కానీ, తంబిదురై ఇతరులకు భిన్నంగా ఒక మంచి వైవిధ్యభరితమైన కథ ఎంచుకున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. హీరో వివేక్ ప్రసన్న మాట్లాడుతూ, 'సినిమాలపై అమితమైన ప్రేమ కారణంగా ఉద్యోగానికి వెళుతూనే దర్శకుడు తంబిదురై ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సినిమా విడుదలకు సహకరించిన నిర్మాత ఇలమారన్‌కు ధన్యవాదాలన్నారు. దర్శకుడు తంబిదురై మాట్లాడుతూ, 'తొలి అవకాశం కోసం అనేక మంది నిర్మాతలను సంప్రదించాను. చివరకు నా స్నేహితులతో కలిసి ఈ సినిమా మొదలుపెట్టాను. వారి పేర్లు వెల్లడించవద్దని చెప్పడంతో నిర్మాతగా నా భార్య పేరు వేసుకున్నాను. పైలెట్ మూవీగా సినిమా తీశాం. బాగుందని చెప్పడంతో సినిమాగా తెరకెక్కించాం' అని తెలిపారు.

కయదు లోహర్‌కు వరుస అవకాశాలు



'డ్రాగన్' మూవీ హిట్ కావడంతో హీరోయిన్ కయదు లోహర్‌కు తమిళంలో వరుస అవకాశాలు వరిస్తున్నాయి. ప్రదీప్ రంగనాధన్ హీరోగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన డ్రాగన్ మూవీ గత నెలలో విడుదలై ఘన విజయం సాధించడంతో పాటు రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. ఇందులో అనుపమ పరమేశ్వరన్, కయదు లోహర్ హీరోయిన్లుగా నటించారు. ఇందులో ఈమె పాత్రకు ప్రశంసలు దక్కాయి. ఈ విజయంతో ఈ అమ్మడుకు పలు సినీ అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం అధర్వ హీరోగా నటించే 'ఇదయం మురళి', కాళిదాస్ నటించే 'నిలా వరుమ్ వేలై', విష్వక్ సేన్ నటిస్తున్న 'ఫంకీ', నవీన్ పాలి, రవితేజా చిత్రాల్లో నటిస్తున్నారు. అలాగే, కోలీవుడ్‌లోనూ మరికొన్ని ప్రాజెక్టుల కోసం సంప్రదిస్తున్నట్టు ఆమె వెల్లడించారు.


'మర్మర్' సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

కొత్త దర్శకులను మీడియా ప్రోత్సహించాలి

● 'మర్మర్' డైరెక్టర్

తమిళ చిత్రజ్యోతి

చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టే కొత్త దర్శకుల (డెబ్యూ డైరెక్టర్ల)ను మీడియా ప్రోత్సహించాలని 'మర్మర్' చిత్ర దర్శకుడు హేమ్‌నాథ్ నారాయణన్ కోరారు. ఎస్‌పీకే పిక్చర్స్, స్టాండలోన్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ప్రభాకరన్ నిర్మించిన చిత్రం 'మర్మర్'. గతవారం విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. మొదట అతి తక్కువ థియేటర్లలో విడుదల చేశారు. చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకాదరణ బాగా ఉండటంతో ఈ సినిమా ప్రదర్శించే థియేటర్ల సంఖ్య రెట్టింపు చేశారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సక్సెస్ వేడుకలను తాజాగా నగరంలో నిర్వహించింది. ఇందులో చిత్ర దర్శకుడు హేమ్‌నాథ్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర విజయంలో అండగా నిలిచిన మీడియాకు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఒక సినిమా విజయానికి మీడియానే వెన్నెముక. మా సినిమా గురించి రివ్యూల్లో మీడియా అంత బాగా రాస్తారని ఊహించలేదు. మీడియా చేస్తున్న పనితో కొత్తవారు మరింత ముందుకు వెళ్ళేలా ప్రేరేపిస్తుంది. ఇండస్ట్రీలోకి వచ్చే కొత్తవారిని మీడియా ప్రోత్సహించాలి.అపుడే మంచి కంటెంట్‌తో కూడిన చిత్రాలు వస్తాయి' అని పేర్కొన్నారు. అలాగే, చిత్ర బృందం సభ్యులు సినిమా విజయంపై సంతోషం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. ఈ చిత్రంలో రిచీ కపూర్, దేవరాజ్ ఆర్ముగం, యువికా రాజేంద్రన్, ఆర్య సెల్వరాజ్‌లు ముఖ్య పాత్రలను పోషించారు.

అయేషా జీనత్ - దీక్షిత్ జంటగా కొత్త చిత్రం

'బిగ్‌బాస్' ఫేం అయేషా జీనత్ కథానాయికగా, కన్నడ నటుడు దీక్షిత్ శెట్టి జంటగా ఓ చిత్ర తెరకెక్కనుంది. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రం ద్వారా దీక్షిత్ శెట్టి తొలిసారి తమిళంలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభ పూజా కార్యక్రమం గురువారం నగరంలో జరిగింది. శరవణ ఫిల్మ్ ఆర్ట్స్ పతాకంపై నిర్మాత జి.శరవణన్ నిర్మించే ఈ చిత్రానికి సారా దర్శకత్వం వహిస్తున్నారు. 'కేడీఎం', 'బ్లింక్', 'దసరా', 'ది గర్ల్ ఫ్రెండ్' వంటి కన్నడ హిట్ చిత్రాల్లో నటించిన దీక్షిత్ శెట్టి... అటు కన్నడం , ఇటు తెలుగులోనూ అభిమానులను సొంతం చేసుకున్నాడు. ఇపుడు ఈ మూవీ ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. భారీ వ్యయంతో రూపొందే పాన్ ఇండియా మూవీగా తమిళం, తెలుగు, కన్నడతో పాటు పలు భాషల్లో నిర్మిస్తున్నారు. మలేసియాలో జరిగిన యధార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు.


కొత్త చిత్రం పూజా దృశ్యం

ఆధ్యాత్మికం

అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో మైలాడుదురై జిల్లాలో 'తిరువణ్ పురుషోత్తమం పురుషోత్తమర్ ఆలయం' మూడవదిగా కీర్తినొందింది. శీర్గాళికి తూర్పుదిశగా ఐదు మైళ్ల దూరంలో తిరునాంగూరులో ఈ క్షేత్రం ఉంది. రాష్ట్రంలోని వైష్ణవాలయాల్లో ఈ క్షేత్రంలోనే పురుషోత్తముడనే తిరునామంతో నంబెరుమాళ్ భక్తులను అనుగ్రహిస్తుండం విశేషం. తిరుమంగైయాళ్వారు పది పాశురాల్లో పెరియ తిరుమొళిలో ఈ క్షేత్రం కోసం మంగళాశాసనమొనర్చారు. పెరుమాళ్ అయోధ్య రాముడిగా మంగళాశాసనం చేసి, పెరుమాళ్‌ను కీర్తించి గానం చేసేవారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


ధనుర్ధారిగా దర్శనమిస్తున్న స్వామివారు


తిరువణ్ పురుషోత్తమర్ ఆలయం


శ్రీదేవి భూదేవి సమేత పురుషోత్తముడు

విశేషాల వైష్ణవ క్షేత్రం

పెరియ తిరుమొళి ఆలయం

● సకల సౌభాగ్యాలను కలిగించే తిరునాంగూరు పురుషోత్తముడు
● నంబెరుమాళ్‌ను ఆరాధించిన మనవాళమహామునులు

ఆలయ ఉత్సవాలు...

ఈ క్షేత్రంలోని తిరునాంగూరు పురుషోత్తముడిని వేడుకుంటే ఉత్తమ గుణాలు ప్రాప్తిస్తాయని, విద్యావంతులవుతారని, యువతులకు వివాహ ఆటంకాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయంలో తమిళ మాసం పంగుణి నెలలో వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆవణి పౌర్ణమి దినాన పవిత్రోత్సవం, తై అమావాస్య మరుసటి దినం గరుడోత్సవం అత్యంత వైభవంగా జరుగుతాయి.


గరుడ వాహనంలోపై స్వామివారు

స్థలపురాణం...

వ్యాఘ్రపాదుడు అనే మహర్షి సంతానం కోసం పురుషోత్తముడిని నిత్యం ప్రార్థించేవాడు. స్వామివారి అనుగ్రహంతో ఆయనకు ఉపమన్యు అనే కుమారుడు జన్మించాడు. పెరుమాళ్ ఆలయంలో ఉన్న నందనవనానికి వ్యాఘ్రపాదుడు రోజూ వెళ్ళి పూలు కోసి, వాటిని మాల కట్టి పెరుమాళ్‌కు వేసేవారు. ఓ రోజు నందనవనానికి వెళుతున్నపుడు ఉపమన్యు తాను కూడా వస్తానని పట్టుబట్టాడు. ఆ బాలుడి ఏడుపు మాన్పించడం కోసం అతడిని వెంటబెట్టుకుని వెళ్ళి నందనవనం ప్రవేశ ద్వారం వద్దే అతడిని కూర్చోబెట్టి పూల కోసం వెళ్ళాడు. కాసేపయ్యాక ఆ బాలుడి ఆకలికి ఏడవడం ప్రారంభించాడు. ఆ ఏడుపు విని వ్యాఘ్రపాదుడు ఉద్యానవనం నుంచి పరుగెత్తుకుంటూ అక్కడికి చేరుకున్నాడు. ఆలోగా అక్కడ పురుషోత్తమ నాయకి క్షీరసముద్రాన్ని సృష్టించిఆ బాలుడికి పాలు పట్టడం చూసి ఆయన విస్మయం చెందారు.

ఎలా వెళ్లాలి?

చెన్నై సహా ప్రధాన నగరాల నుండి శీర్గాళికి వెళ్ళటానికి రాష్ట్ర రవాణ సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. శీర్గాళి నుంచి ఐదు మైళ్ల దూరంలో ఉన్న తిరునాంగూరు వద్ద నున్న ఈ ఆలయానికి వెళ్లేందుకు ఆటోలు, టాక్సీలు కూడా ఉన్నాయి. ఈ ఆలయాన్ని ఉదయం 9 నుండి 11.30 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


సంపూర్ణ అలంకారంతో ఇష్టదేవేరులతో స్వామివారు

ఆలయ వైభవం...

మూలవిరాట్టు పురుషోత్తముడు తూర్పుదిశగా నిలబడి శ్రీదేవి, భూదేవి సమేతుడై పూజలందుకుంటున్నారు. తాయార్ పురుషోత్తమ నాయకి ఆగ్నేయ దిశగా ప్రత్యేక సన్నిధిలో ఆశీనభంగిమలో భక్తులకు కనువిందుచేస్తోంది. లోపల ప్రాకారం ఆండాళ్, శ్రీరామచంద్రమూర్తి, సీతా, లక్ష్మణ, ఆంజనేయసమేతుడై కొలువుదీరారు, నమ్మాళ్వార్, రామానుజులు, సేనైముదలియార్ సన్నిధులు కూడా ఉన్నాయి. ఈ ఆలయంలో మూడు చోట్ల ఆంజనేయస్వామి సన్నిధులున్నాయి. ఈ ఆలయ తీర్థకొలను ఎల్లప్పుడు స్వచ్ఛంగా ఉండటం విశేషం. మనవాళ మహామునులు రెండేళ్లపాటు ఈ క్షేత్రంలో బసచేసి స్వామివారిని ఆరాధించి తరించారు. రుమేతస్ అనే చదువురాని యువకుడిని ఇక్కడి స్వామివారు అనుగ్రహించి పండితుడిగా మార్చినట్లు స్థలపురాణం పేర్కొంటోంది.


ఆలయంలోని ప్రాచీన తైలవర్ణ చిత్రం

మూలవిరాట్టు నామధేయం : పురుషోత్తమర్
తాయార్ నామధేయం : పురుషోత్తమ నాయకి
తీర్థం : క్షీరసముద్రం, స్థల వృక్షాలు : పనస, అరటి
విమానం : సంజీవి విగ్రహ విమానం.

మహాబలిపురం తీరంలో మాసిమఖ పౌర్ణమి

తీరంలో గుమికూడిన ఇరుళర్, గిరిజనులు



చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం మహాబలిపురం సముద్రతీరంలో గురువారం ఉదయం మాసి మఖ పౌర్ణమి వేడుకల్లో ఇరుళర్, గిరిజనులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుండి ఇరుళర్ కులస్థులు, గిరిజనులు వేల సంఖ్యలో మూడు రోజులకు ముందే మహాబలిపురానికి వచ్చి, సముద్రతీరానికి చేరువగా గుడారాలు వేసుకున్నారు. మాసిమఖ పౌర్ణమి రోజున తమ కులదేవత కన్నియమ్మన్ కడలి గర్భం నుండి పైకొచ్చి అనుగ్రహిస్తుందని ఇరుళర్, గిరిజనుల విశ్వసిస్తున్నారు. ఆ కారణంగానే ప్రతియేటా మహాబలిపురం సముద్రతీరంలో మాసిమఖం పౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వస్తుంటారు. తీరమంతటా ఇసుకతో చిన్న చిన్న గుడులు కట్టి పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి దీపాలు వెలిగించి హారతులు సమర్పించారు. ఈ వేడుకల్లో గిరిజనులు వింత వాయిద్యాలతో తమ పూర్వీకులు నేర్పిన వింత నృత్యాలు చేసి చూపరులను ఆకట్టుకున్నారు. గురువారం ఉదయం నుండి రాత్రి ఏడు గంటల దాకా ఈ ఇరుళర్, గిరిజనులు కుటుంబ సమేతంగా ఈ వేడుకల్లో పాల్గొని పాటలుపాడుతూ చిందులేశారు.

రికార్డు స్థాయిలో చెన్నై పోర్ట్ కార్గో హ్యాండ్లింగ్



అడయార్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్ట్ ట్రస్ట్ కార్గో హ్యాండ్లింగ్‌లో సరికొత్త మైలురాయి చేరుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 51.60 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) కార్గో హ్యాండ్లింగ్ చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 11వ తేదీ నాటికి ఏకంగా 51.68 ఎంఎంటీ కార్గో హ్యాండ్లింగ్ చేసినట్టు చెన్నై పోర్ట్ ట్రస్ట్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మైలురాయిని పురస్కరించుకుని చెన్నై పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ సునీల్ పాలివాల్ పోర్టు సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానంగా వెస్సెల్ ఆపరేటర్లు, స్టీమర్ ఏజెంట్లు, టెర్మినల్ ఆపరేటర్లు, స్టేక్ హోల్డర్లు, పోర్టు ఉన్నతాధికారుల పనితీరును ప్రశంసించారు.

ఎస్సార్‌డబ్ల్యూహెచ్‌క్యూవో ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం


అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే ఉమెన్ హెడ్‌క్వార్టర్స్ ఆర్గనైజేషన్ (ఎస్సార్‌డబ్ల్యూహెచ్‌క్యూవో) ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సదరన్ రైల్వే ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోని సులయ హాలులో జరిగిన కార్యక్రమానికి ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సోనియా సింగ్, వైస్ ప్రెసిడెంట్ రేఖా కౌశల్, సభ్యులు, వంద మందికి పైగా ఉద్యోగినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనియా సింగ్ మాట్లాడుతూ... సామాజాభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యులు కావాలని, ప్రకృతికి వెన్నెముక లాంటి వారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 26 మంది ఉద్యోగినులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ చిత్ర బాలసుందర్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.

అన్నానగర్‌లో 'మీండుమ్ మంజప్పయ్'


ఎంఎండీఏ కాలనీ పోస్టాఫీసు వద్ద పసుపు సంచుల పథకం ప్రారంభోత్సవంలో మేయర్ ప్రియ తదితరులు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిరోధించే దిశగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్నానగర్ జోన్ 106వ వార్డు ఎంఎండీఏ కాలనీ మెయిన్‌రోడ్డులోని తపాలా కార్యాలయం వద్ద 'మీండుమ్ మంజప్పయ్' (మళ్ళీ పసుపు సంచి) పేరుతో గుడ్డతో చేసిన పసుపు సంచుల విక్రయాన్ని మేయర్ ఆర్.ప్రియ గురువారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన పసుపు సంచుల వెండింగ్ మిషన్‌ను కూడా ఆమె ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 2021 నుండి నగరంలో పసుపురంగు గుడ్డ సంచులను వాడకాన్ని కార్పొరేషన్ ప్రోత్సహిస్తోందన్నారు. నగరంలో 25 చోట్ల ఈ పసుపు సంచుల వెండింగ్ మిషన్లున్నాయని, అదనంగా 17 చోట్ల ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్, డిప్యూటీ కమిషనర్ కే జే ప్రవీణ్‌కుమార్, కార్పొరేషన్ కౌన్సిల్ పాలకపక్షం నాయకుడు ఎన్.రామలింగం, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు ఎన్.సిట్రరసు, డాక్టర్ కే శాంతకుమారి, జోనల్ కమిటీ చైర్మన్ కేపీ జైన్, కౌన్సిలర్ ఆదియమాన్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య ప్రదర్శనలో ఎస్కేపీసీ విద్యార్థుల సందడి


ఎస్కేపీసీ స్టాల్

ప్యారీస్,మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీటీడీసీ) ఏర్పాటు చేసిన 49వ వాణిజ్య ప్రదర్శన బుధవారం ప్రారంభమై శుక్రవారం వరకు కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో కన్యకా పరమేశ్వరి మహిళా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఎస్కేపీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పౌర సంక్షేమాన్ని మెరుగుపరిచేలా ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ స్టాల్‌లో ఫొటోలు, సమాచార ఛార్ట్, నమూనాలు కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఎస్కేపీసీ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ మాట్లాడుతూ...విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడానికి వాణిజ్య ప్రదర్శన మంచి అవకాశమని, ఈ కార్యక్రమం ఒక ఇంటరాక్టివ్, ఉత్తేజకరమైన అనుభవమని తెలిపారు. ప్రదర్శనలో ఎస్కేపీసీ స్టాల్‌ను టీటీడీసీ ఉన్నతాధికారులు తిరువీరుస్వామి, టీఎం ఉమాశంకర్, ఉన్నత విద్యాశాఖ అధికారులు వీక్షించి నిర్వాహకులను అభినందించారు.


ఎస్కేపీసీ స్టాల్ తిలకిస్తున్న టీటీడీసీ అధికారులు తిరువీరుస్వామి, ఉమాశంకర్ తదితరులు

బ్లూస్టార్ వాణిజ్య రిఫ్రిజిరేటర్ల విస్తరణ

అడయార్, మార్చి 13 : రానున్న వేసవి డిమాండ్ దృష్ట్యా కొత్తగా వాణిజ్య శీతలీకరణ ఉత్పత్తులను ప్రారంభించినట్టు బ్లూస్టార్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యారాజన్ వెల్లడించారు. నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ వేసవిలో ఎదురయ్యే డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా విభిన్న మోడళ్లలో రిఫ్రిజిరేటర్లను మార్కెట్‌లోకి తెచ్చినట్టు వెల్లడించారు. తమ కంపెనీ వృద్ధితో పాటు మార్కెట్ షేర్ మరింతగా పెంచుకోవాలనే లక్ష్యంతో తమ ప్రణాళికలు ఉన్నాయన్నారు. బ్లూస్టార్ డీప్ ఫ్రీజర్లు 26 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా మంచి కూలింగ్ ఇస్తుందన్నారు. ఇది కూలర్, ఫ్రీజర్ మధ్య మారే కన్వర్టిబుల్ కూలింగ్ మోడ్‌లను కలిగి ఉంటుందని, ఈ ఫ్రీజర్లు 60 లీటర్ల నుంచి 600 లీటర్ల వరకు సామర్థ్యాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కూలర్ కమ్ ఫ్రీజర్లు 375 లీటర్లుగాను, బాటిల్ కూలర్లు 300 లీటర్ల నుంచి 500 లీటర్లుగాను, గ్లాస్ టాప్ డీప్ ఫ్రీజర్లు వంద లీటర్ల నుంచి 600 లీటర్ల వరకు ఉంటాయని తెలిపారు. ఇది డైరీ, ఐస్‌క్రీం, ఫ్రోజెన్ ఫుడ్, రెస్టారెంట్లు, కన్వీనియన్స్ స్టోర్లు, హాస్పిటాలిటీ, సూపర్ మార్కెట్లు వంటి విస్తృత కస్టమర్ బేస్‌కు సేవ చేయడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ డీప్ ఫ్రీజర్ల ధరలు ఆకర్షణీయమైన ధర రూ.16 వేలతో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో త్యాగరాజన్ తదితరులు